విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండండి:డిఎస్పీ

విశాలాంధ్ర - కార్వేటినగరం : విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని దిశా డిఎస్పీ ఆర్.రామరాజు తెలిపారు. కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, దిశా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పీ ఆర్.రామరాజు మాట్లాడుతూ ర్యాంగింగ్ పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయని, కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిలా ఎస్.ఐ గిరిజా మాట్లాడుతూ దిశా చట్టం మహిళలకు మాత్రమే కాదని, దానిని పురుషులు సైతం వినియోగించవచ్చని గుర్తు చేశారు. అనంతరం డిఎస్పీ విద్యార్థులుకు స్మార్ట్బోర్డు ద్వారా ప్రజంటేషన్స్ చూపిస్తు చట్టాలపై అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విజయులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల పై అవగాహన కలిగిఉండాలని, ర్యాగింగ్కు పాల్పడిన, ప్రోత్సహించినా నేరమని, చట్టపరమైన శిక్షలు ఉంటాయని గుర్తు చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయ రెడ్డి విద్యార్థుల చేత ర్యాగింగ్ రహిత కళాశాలగా సహకరిస్తామని, ర్యాగింగ్ నివారణ కు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సి.యన్. లత, కార్తీక్, స్వామి శివయ్య, మణిగండన్, నర్మద, జేకేసి మెంటర్ లోకేశ్వర్, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు అరెస్టు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్ఎస్సి సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజును అక్రమంగా అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా దళిత గర్జన కార్యక్రమాన్ని నిర్వహించుటకు కావలికి విచ్చేసిన ఎస్సీ సెల్ అధ్యక్షులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం, ప్రతిపక్షాల హక్కులను కాల రాయడం మేనని అన్నారు. ఈ విధంగా దళితులను అణిచివేయడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని మన రాష్ట్రంలో జరగడం పరిపాటీగా మారిందని అక్రమ అరెస్టులతో దళితుల ఉద్యమాలను అణిచివేయలేరని అన్నారు.

వివేకానంద స్ఫూర్తి ఎందరికో ఆదర్శం

పలమనేరు- విశాలాంధ్ర: విజయవాడ లోని పలమనేరు రూరల్ మండలానికి చెందిన కాపుపల్లి రవీంద్ర రెడ్డికి ఉత్తమ సేవకుడిగా అవార్డు ప్రధానం చేశారు.స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నిస్వార్థంగా సేవ చేస్తున్న వారిని రాష్ట్రం నలుమూలల నుండి గుర్తించి పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు విజయవాడలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ ఇంతియాజ్ ఐఏఎస్ ప్రముఖ వ్యాఖ్యాన కళా శిరోమణి వేముల గుప్త హాజరతయ్యారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు చేతుల మీదగా పలమనేరు కాపుపల్లి రవీంద్రారెడ్డిని విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో నందు సన్మానించారు. తిరుమల తిరుపతి దేవ స్థానంనకు అలాగే పలు సేవా కార్యక్రమాల్లో తనదైన స్థాయిలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురళి మోహన్, మురళి మోహన్ రాజు, కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, వీ కే ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరవ విడత జగనన్న తోడు లబ్ది

జిల్లాలో 31,649 మంది లబ్దిదారులకు రూ.84,80,447 లు లబ్ది

విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి నేడు 6 వ విడత జగనన్న తోడు పథకాన్ని ఉ.11.00 గం.లకు తాడేపల్లె నుండి వర్చువల్ విధానంలో కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వీధి విక్రయదారులు, కాయగూరల విక్రయదారులు, తదితర చిరు వ్యాపారులు రుణాల కొరకు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం ద్వారా రూ.10 వేలు వడ్డీ లేని రుణాలను లబ్ధిదారులకు అందించడం జరుగుతున్నదని, ఈ రుణాలను క్రమం తప్పకుండా బ్యాంకులకు తిరిగి చెల్లించిన వారికి అందుకు సంబంధించిన పూర్తి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. 6 వ విడత జగనన్న తోడు పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని 21,866 మంది లబ్ధిదారులకు రూ.59,897,00, పట్టణ ప్రాంతాలలోని 9,783 మంది లబ్ధిదారులకు రూ.24,90,721 మొత్తం 31,649 మొత్తం లబ్ధిదారులకు రూ.84,80,447 లు లబ్ధి చేకూరనున్నదని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

టిడిపి నేత సయ్యద్ సుహేల్ భాష అరెస్ట్

విశాలాంధ్ర - పుంగనూరు:-తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువ నాయకుడు సామాజికవేత్త సయ్యద్ సుహేల్ భాషను సోమవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నందు ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని సోమల పోలీసులు అరెస్టు చేయడం జరిగింది పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సోమల మండల పర్యటనలో భాగంగా నంజంపేటలో జరిగిన వైసిపి టిడిపి ఘర్షణలో భాగంగా సయ్యద్ సుహేల్ భాష పై కేసు నమోదు చేయడం జరిగిందని అందులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలిస్తున్నామన్నారు టిడిపి నేత సయ్యద్ సుహేల్ భాషను అక్రమంగా అరెస్టు చేశారని టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పేర్కొనడం జరిగింది ఇరువర్గాల మధ్య ఘర్షణలో నా వాహనంపై వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేసి వాహనాన్ని ధ్వంసం చేయడం జరిగిందని మేము ఫిర్యాదు చేసిన ఇంతవరకు పోలీసులు కేసులు నమోదు చేయలేదని తెలిపారు ఇలాంటి అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొని ముందుకు వెళ్తాం తప్ప అక్రమ కేసులు భయపడి లేదని హెచ్చరించారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి

అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీరాములు డిమాండ్

విశాలాంధ్ర - చిత్తూరు: గ్రీస్ అంబాసిడర్ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం చిత్తూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలోని చిత్తూరు ఉమ్మడి జిల్లాల, కోఆర్డినేటర్ జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ ఐ.ఎస్.షణ్ముఖం రామ్ కు గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ .శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ .నాగరాజు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి .జనార్ధన్, ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర, కే.మణి, వి.సి. గోపీనాథ్, హెచ్ .బాలాజీ రావు బృందం కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా . శ్రీరాములు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని అంబాసిడర్(హరిత రాయబారులు) పారిశుద్ధ్య కార్మికులు గ్రామీణ ప్రాంతంలోని ప్రజా ఆరోగ్యని కాపాడుతున్న కార్మికులకు అధికారులు కొన్ని నెలలుగా జీతాలు పెండింగ్లో పెట్టడం బాధాకరమన్నారు. కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు వారి కుటుంబాల పోషణ చాలా కష్టంగా ఉందన్నారు ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని రానున్న సంక్రాంతి పండగ పూట నైన కార్మికుల కుటుంబాలను పస్తులతో పెట్టకుండా పెండిగ్ జీతాలను వెంటనే మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కోఆర్డినేటర్ అధికారి స్పందిస్తూ జీతాలు చెల్లించడానికి సత్వరమే చర్యలు తీసుకుంటానని నాయకులకు హామీ ఇచ్చారు.

విజయ డైరీ తిరిగి ప్రారంభించాలని పార్టీలకతీతంగా ఉద్యమం

రైతు సంఘం నేతల స్పష్టీకరణ

విశాలాంధ్ర - చిత్తూరు : ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా చిత్తూరు జిల్లా పర్యటనలో అధికారానికి వచ్చిన వెంటనే విజయ డైరీ ని పున ప్రారంభిస్తామని నమ్మబలికి మాట తప్పారని రైతాంగం దీనికి తప్పక గుణపాఠం చెప్తారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి. జనార్ధన్, అభ్యుదయ రైతు సేవా సంఘం అధ్యక్షులు హరిబాబు చౌదరి పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు రైతు సంఘం కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో పనిచేసిన ముఖ్యమంత్రుల కన్నా మరీ ఘోరంగా మడమ తిప్పిన సియం గా ప్రస్తుత నేత ముందు వరుసలో ఉంటారని విమర్శించారు. దేశంలోనే అగ్రగామిగా ఉంటూ సహకారం గంలో రైతాంగానికి, అలాగే ప్రజానీకానికి సేవలందిస్తున్న విజయ డెయిరీ అమూల్ కు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. జిల్లావ్యాప్తంగా పాల సహకార సంఘాలకు ,జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి డెయిరీ కి కొట్లాది రూపాయల ఆస్తులు ఉన్నాయని నేడు వాటిని అప్పనంగా 99 కోట్లకు దారా దత్తం చేయడం అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట చందంగా ఉందని ఎద్దేవా చేశారు.. సహకార చక్కర కర్మాకారాలను సైతం ప్రారంభించక చెరకు రైతులకు ఇబ్బందులు గురి చేస్తున్నారని వారు వాపోయారు. ఉమ్మడి జిల్లాలో ఆరు కర్మాగారాలకు ఐదు మూసివేయ డమంటే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యధోరణికి పరాకాష్ట అని పేర్కొన్నారు.పాడి రైతులకు లీటర్ కు 4 సబ్సిడీ ఇస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు కాలేదని ఫలితంగా చిత్తూరు జిల్లా రైతాంగం పాడి రైతులు గత మూడు న్నర సంవత్సరంగా 1700 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. అలాగే జిల్లాలో ప్రయివేటు డైరీల సిండికేట్ వల్ల ప్రతి సంవత్సరము 5000 కోట్లు పైగా పాడి రైతులు నష్టపోతున్నా ఈ ప్రభుత్వాలకి చీమకుట్టినట్టు కూడా లేదని వాపోయారు.విజయ డెయిరీ ప్రారంభిం చాలని జిల్లా వ్యాప్తంగా రైతాంగం చే సంతకాల సేకరణ చేపట్టబోతు న్నమని అలాగే న్యాయపోరాటానికి సైతం సిద్ధమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్. నాగరాజన్, దాసరి చంద్ర, గోపీనాథ్ ,మణి,తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సంక్రాంతి కానుక అందించిన ఎమ్మెల్సీ భరత్

విశాలాంధ్ర - కుప్పం: మండల పరిధిలోని మహిళా ఉద్యోగులకు అందరికీ చిత్తూరు జిల్లా శాసన మండలి సభ్యులు కే.ఆర్.జే భరత్ సంక్రాంతి కానుకలు మున్సిపల్ కార్యాలయం వద్ద కుప్పం మండలానికి చెందిన సచివాలయ మహిళా ఉద్యోగులు, మహిళా వాలంటీర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏ.ఎన్.ఎం లు, అశావర్కర్లు, అంగన్ వాడి ఆయాలు,టీచర్లు,సూపర్ వైజర్లు, మహిళా గ్రీన్ అంబాసిడర్లు,గ్రీన్ గార్డ్ లు, వై.యస్.ఆర్. క్రాంతి పథకం మహిళా ఉద్యోగులు, మహిళా సంఘమిత్రలు పాఠశాలలలో మధ్యాహ్న భోజన అయా మహిళలు, మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం శాకలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు అందరికీ సంక్రాంతి కానుక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ సమాజం లో పురుషులతో సమానంగా మహిళలు సైతం అన్ని రంగాల్లో ముందంజలో రాణిస్తున్నారని, వారిని ఏ ఒక్క శాతం కూడా తక్కువ చేసి చూడకూడదని, ఈ ప్రపంచ మానవ మనుగడకు కారణం మహిళలే. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉంది. మహిళలను వారి ప్రాముఖ్యతను గుర్తించేందుకే ఈ సంక్రాంతి కానుకను మహిళా ఉద్యోగులకు అందించడం జరుగుతుందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ కమిషనర్ రవి రెడ్డి, చైర్మన్ డాక్టర్ సుధీర్, వైస్ చైర్మన్ మునస్వామి, కౌన్సిలర్లు, ఎంపిడిఓ, ఎం.ఈ.ఓ , అన్ని శాఖల మహిళా ఉద్యోగులు, వైకాపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని సబ్డివిజన్ల పరిధుల్లో జల్లికట్టు, కోడి పందే లపై నిఘా ఉంచండి

-అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష ఆదేశం

విశాలాంధ్ర - చిత్తూరు : జిల్లాలో ఎక్కడా జల్లికట్టు, కోడి పందేలు, జూద క్రీడలు జరుగకుండా నిఘా వేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని డి.ఐ.జి ఎం. రవి ప్రకాష్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. . కోడి పందేలు, జల్లికట్టు, జూద క్రీడలు నిర్వహించడం నిషేధమని,ఎవరైనా వీటి జోలికెళ్లినా, ఆడినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకోవాలన్నారు.సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకుని భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలని రేంజ్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని సి.ఐ లు, ఎస్సైలు గ్రామ పెద్దలుతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరుగకుండా ఉండేలా సమాయత్తం చేయాలన్నారు. సంబంధిత డిఎస్పీలుఅప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ పక్కాగా కొనసాగించాలన్నారు. కోడి పందేలు, జల్లికట్టు ఆటలు జరిగేవీలున్నప్రాంతాల్లో పికెట్లుఏర్పాటు చేయాల న్నారు. గతంలోకోడి పందేలు, జల్లికట్టులపైకేసులు న్నవారినిముం దస్తుగాబైండోవర్చేయాలన్నారు. కోళ్లకుకత్తులు కట్టిపందేలు ఆడటం,జన సమూహాల మధ్యన ఎద్దులను రెచ్చగొట్టి కట్టడి చేయడంలో భాగంగా హింసించడం, తదితరాలన్నీమూగ జీవాలనుహింసించడమే అవుతుందన్నారు.జల్లికట్టు, కోడి పందేల నిర్వహణ వేదికలకుఎవరైనా తోటలు,స్థలాలు ఇస్తే వారిపైకూడాకేసులు నమోదు చేయాలన్నారు, అన్ని సబ్ డివిజన్ల పరిధుల్లో 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుం దన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు, జల్లికట్టు ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులకు మద్దతు ధరలపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా శిక్షణ -రైతు ధాన్యం కొనుగోలు కు మద్దతు ధర కల్పించాలి: జే సి

విశాలాంధ్ర - తిరుపతి : ఖరీఫ్ 2022-23 సీజనుకు తిరుపతి జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి మద్దతు ధరకు ధాన్యము కొనుగోలు చేయుటకు వ్యవసాయ సిబ్బందికి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అయిన పి.ఏ.సి. ఎస్ మరియు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ సిబ్బందికి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణ సందర్భంగా రైతులకు మద్దతు ధరలపై అవగాహన పోస్టర్ పాంప్లెట్ లను జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించుటకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారము ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ డి కే బాలాజీ మాట్లాడుతూ ఈ-క్రాప్ మరియు ఈ-కే.వై.సి ప్రాముఖ్యతను వివరిస్తూ, రైతులు దళారులని ఆశ్రయించకుండా, రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి,తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందవలసిందిగా సూచించారు. మరియు ఆర్.బి.కె లలో రైతుల వద్ద నుండి కొనుగోలుకై వి.ఏ.ఏ. లు, పీ .పీ .సీ సిబ్బంది తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ధాన్యం కొనుగోలు లో ఏ దశ లో అయినను రైతు నష్టపోకుండా చూడాలని తెలిపారు. సివిల్ సప్లైస్ మేనేజర్ సుమతి అధికారులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన క్రొత్త పాలసీలను వివరించి బహిరంగ మార్కెట్ లో అమ్మదలచిన రైతులు కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ఉంటే అమ్మవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బి.శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. ప్రసాద రావు, మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ సురేంద్ర బాబు, ఆర్బికే సిబ్బంది, వ్యవసాయ మార్కెటింగ్ పి ఎ సి ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీర్థం పిహెచ్సికి ల్యాబ్ టెక్నీషియన్ కొరత

విశాలాంధ్ర - తిరుపతి: మండలం లోని బైరెడ్డిపల్లి, తీర్థం రెండు పి హెచ్సిలు కలవు.తీర్థం పి హెచ్సిలో గత 8 సంవత్స రాలుగా ల్యాబ్ టెక్నీష యన్ లేక పి హెచ్ సి పరిధిలోని గ్రామ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎనిమిది సంవత్సరాల మునుపు పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ చిత్తూరు మలేరియా సెంటర్ కే పరిమితం కావడంతో అప్పటి నుండి ఇప్పటి వరకు ల్యాబ్ ట్రెక్నీషియన్ లేదని, రక్త పరీక్ష, డెంగ్యూ,మలేరియా ,సీజనల్ వ్యాధులు పరీక్షించుకోవాలంటే అందుబాటులో టెక్నీషియన్ లేకపోతే డాక్టర్ ఆరోగి కి ఎటువంటి మందులు ఇవ్వాలి..రోగం ఎలా నయం అవుతుంది. సీజనల్ వ్యాధులతో రోజు రోగులు హాస్పిటల్ బాట పడుతున్నారు.ఇక్కడ టెక్నీషియన్ లేక బైరెడ్డిపల్లి పంపుతున్నాం. రోడ్డు సౌకర్యం అస్తవ్యస్తంగా ఉండటంతో వెళ్ళడానికి రోగులు నిరాకరిస్తున్నారు. గ్రామ ప్రజలకు సమాధానం చెప్పలేకపో తున్నాం.వారంలో మూడు రోజులు వస్తున్న టెక్నీషియన్ కూడ రాలేదు.అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు శరీరం అనుకూలించక వస్తున్నారు.లోపం ఉన్న సమస్యను ఉన్నత అధికారులకు తెలియబరిచిన ఫలితం శూన్యమని సిబ్బంది వాపోతున్నారు.చిత్తూరు జిల్లా డి ఎం హెచ్ ఓ దీనిపై స్పందించి లోటుగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ భర్తీ చేయవాల్సిందిగా గ్రామస్థులు,పి హెచ్ సి సిబ్బంది కోరుతున్నారు.

కళ్యాణ కట్టలో తొలగించిన కార్మికులను

విధుల్లోకి తీసుకోవాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - తిరుపతి : తిరుమలలోని కళ్యాణ కట్ట లో పనిచేస్తున్న కార్మికులను 53 మందిని అకారణంగా తొలగించడం చాలా దారుణమైన విషయమని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమలలోని కళ్యాణకట్టలో పనిచేస్తున్న పిసురేటు కార్మికులను 53 మందిని అకారణంగా తొలగించడం జరిగిందని అన్నారు. తప్పుడు ఫిర్యాదులతో బార్బర్లపై విజిలెన్స్ అధికారులు లేనిపోని తప్పులు చేశారంటూ వారిని కక్షపూరితంగా వారిపై తప్పుడు ఆరోపణలు చూపిస్తూ 53 మందిని తొలగించడం జరిగిందని తొలగించిన వారిని వీధులలోకి గాని తీసుకోకపోతే ప్రత్యక్షంగా పోరాటాలకు సిద్ధమ వుతామని టీటీడీ అధికారులకు ఒక ప్రకటనలో హెచ్చరిక జారీ చేశారు. అదేవిధంగా వీరికి అండగా చేతివృత్తుదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య కూడా సంఘీభావం తెలుపుతూ వారు చేసే పోరాటాలకు పూర్తిగా మా చేతి వృత్తుదారుల సంఘం అండగా ఉంటుందన్నారు.

గ్రావెల్ ట్రిప్పర్లను అడ్డుకున్న టిడిపి నాయకులు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణం గాంధీ విగ్రహం వద్ద గ్రావెల్ లోడుతో తరలుతున్న పలు ట్రిప్పర్లను స్థానిక టిడిపి నాయకులు అడ్డుకున్నారు. మంగళవారం గ్రావెల్ తరలింపు నిరసిస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్,మాజీ ఎమ్మెల్యే హేమలత ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ తమిళనాడుకు విచ్చలవిడిగా మట్టి తరలించడం సమంజసం కాదన్నారు.సంబంధిత మైన్స్ అధికారులు అనుమతులు ఇవ్వడం వల్ల గ్రావెల్ ట్రిప్పర్లు సంఖ్య భారీగా పెరిగిపోయి ప్రజలకు ఇబ్బందులకు ఏర్పడుతున్నట్టు ఆమె చెప్పారు.దీనివల్ల వాహన రాకపోకలు కూడా ఇబ్బందికరంగా మారి వాయు కాలుష్యం పెరిగిపోయింది అన్నారు. పైగా రోడ్లు కూడా దెబ్బతినడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి వచ్చిందన్నారు.తదనంతరం టిడిపి నాయకులు ఆందోళన చేస్తున్న సమాచారాన్ని అందుకున్న ఎస్సై పురుషోత్తం రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకొని దీనిపై మాజీ ఎమ్మెల్యే హేమలతతో మాట్లాడి సద్ది చెప్పడంతో టిడిపి నాయకులు ఆందోళనలను విరమించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి,ఈశ్వరయ్య,పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో నిందితుడు బాలకృష్ణ అరెస్టు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పోలీస్ స్టేషన్లో నమోదైన ఫోక్సో కేసులో నిందితుడు బాలకృష్ణను(50) స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఫోక్సో కేసులో అదుపులోకి తీసుకున్న నిందితుడు బాలకృష్ణను పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ కుమార్ రెడ్డి,ఎస్సై పురుషోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. మండలంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటివి జరిగితే చట్టపర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎంతటి వారైనా ఇటువంటి విషయాల్లో ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.ఈ సమావేశంలో ఎస్సై పురుషోత్తం రెడ్డి ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీ బీ బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

పలమనేరు - విశాలాంధ్ర :టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక దాతలు శ్రీపురం సీతారామయ్య శేగు నరసింహులు శెట్టి,మంజునాథ్ల సహకారంతో ఆరు నెలల పాటు నెలకోసారి కందిపప్పు గోధుమ పిండి శెనగలు రాగిపిండి నూనె సెనగ గింజలు కోడి గుడ్లు తదితర పోషకాహారం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాధి గ్రస్తులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరింత మందికి సహకారం అందించ డానికి సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, డాక్టర్ మల్లిఖార్జున రెడ్డి, పిపీఎస్ కార్యదర్శి నరసింహులు, నరేంద్ర, వైద్య శాఖ సిబ్బంది రమేష్ బాబు, జగదీశ్వరి, పిపీఎ సభ్యులు విజయకుమార్ రెడ్డి, దేవా, సన్నీ రాజు దొరస్వామి,నారాయణ, దవనముని, పొన్నుడి,విజయకుమార్,మురళి,రామచంద్రా, నిషార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు : మద్యం ను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పమని చిత్తూరు మద్యం డిపో ఎక్సైజ్ ఎస్సై రామకృష్ణ శాస్త్రి అన్నారు. పులిచెర్ల మండలంలోని మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ ఎస్సై తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. మద్యం విక్రయాలను ప్రతిరోజు ఆన్లైన్లో నమోదు చేయాలని జాప్యం వహించరాదని అన్నారు. మద్యం దుకాణాలు ఎదుట ధరల విక్రయ పట్టిక ఉండాలని అన్నారు. దుకాణాలలో స్టాక్ నిల్వ నగదు రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ వెంట కానిస్టేబుల్ రాజశేఖర్ రెడ్డి, రమణ, సూపర్వైజర్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర పుంగనూరు:-మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి గోకుల్ సర్కిల్ జాతీయ రహదారిపై వస్తున్న పట్టణానికి చెందిన గణేష్ 50 ను టెన్త్ క్లాస్ చదువుతున్న మైనర్ బాలుడు ట్యూషన్ కి వెళ్లడానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఢీకొనడంతో గణేష్ కుప్పకులడం జరిగింది పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వచ్చి విషమ స్థితిలో ఉన్న గణేశును ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించడం జరిగింది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగింది దీనిపై పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది.

అడ్డు తొలగించు కోవాలని ఆలిని చంపేశాడు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: అడ్డుతొలగించుకోవాలని తన భార్యని చంపిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానిక ఎస్సై గోపి అందించిన వివరాల ప్రకారం మండలం లోని నక్కలాంపల్లం కు చెందిన శేఖర్ కు వేరొకరితో అక్రమ సంబంధం ఉన్న క్రమంలో తన భార్య తేజస్విని(26) ను అడ్డు తొలగించు కోవాలని పథకం ప్రకారం ఈనెల 8 వ తేదీ రాత్రి హత్య చేశారు.అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు.మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై గోపి చెప్పారు.వీరికి ఒక కుమార్తె,కుమారుడు ఉన్నట్లు చెప్పారు.

వాలంటీర్ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి:సిపిఐ

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ లో ఆత్మహత్యకు పాల్పడ్డ వాలెంటర్ శరవణ కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలి సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.చిత్తూర్ నగర పరిధిలోని జోగుల కాలనీ లో వాలంటరీగా పని చేస్తు న్న శరవణ మరణానికి ప్రేరేపించిన వారు ఎంతటి పలుకుబడి ఉన్నా వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని తెలిపారు. మంగళవారం శరవణ దహన క్రియల కార్యక్రమంలో పాల్గొని మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు

పలమనేరు- విశాలాంధ్ర:పలమనేరులోని శ్రీకృష్ణ పిరమిడ్ నందు స్వామి వివేకానంద గారి160 జయంతి ఉత్సవాలను12 తేదీన 10.30ఏ.యం ఘనంగాజరుపుకోబోతున్నామని ఒక ప్రకటనలోబాలాజ,తాతయ్య, రవీంద్ర శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...స్వామి వివేకానంద భారత దేశపు సంస్కృతి నాగరికతన సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప యుగపురుషుడు. ఈ జయంతి ఉత్సవాలు శ్రీకృష్ణ పిరమిడ్ సొసైట గోవింద దివ్యధామ పలమనేరు హెల్పింగ్ హాండ్స్ పలమనేరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల యువత పుర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనితెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరం స్వామిని మంగళవారం ఉత్తరప్రదేశ్ మంత్రి సురేష్ రాయ్, హిమాచలప్రదేశ్ చింతపూర్ణేశ్వరి ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్ర తాలియా కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో సతీష్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి

: స్పెషల్ సి.ఎస్ అజయ్ జైన్

విశాలాంధ్ర -తిరుపతి : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నవరత్నాలు - పేదలందరికీ ఇల్లు లో భాగంగా గౌ.రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు ఉగాది నాటికి రాష్ట్రంలో ఐదు లక్షల గృహాలు గృహ ప్రవేశాలు చేపడుతున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలో ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు.మంగళవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి నియోజకవర్గం ఊరందూరు జగనన్న కాలనీ లేఔట్ లో సంబంధిత అధికారులతో కలసి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పర్యటించి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి సూచించిన మేరకు, తిరుపతి జిల్లాకు సంబంధించి ఉగాది నాటికి సుమారు 24 వేల సాముహిక గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఊరందూరు లేఅవుట్ కు సంబంధించి 6231 ఇంటి స్థలాలను మంజూరు చేసిన, 4873 మంది పేదలకు గృహాలను మంజూరు చేసిన వాటికి కేటగిరి -3 కింద గృహ నిర్మాణాలు వేగావంతానికి కృషి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 9 వేల గృహాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని సంబంధిత అధికారులు తెలుపగా, మిగిలినవి ఉగాది నాటికీ ప్రారంబించేలా చూడాలని, నేటినుండి 70 రోజులు సమయం మాత్రమే ఉందని అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి అని స్పెషల్ సి ఎస్ ఆదేశించారు.జగనన్న కాలనీలలో మౌలిక వసతులు విద్యుత్, తాగు నీటి వసతి, అంతర్గత రహదారులు, మురికి కాలువలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కావాలని కాలనీలో స్వాగత ద్వారం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సూచించారు. వీరి పర్యటనలో హౌసింగ్ మరియు నరేగా పి.డి శ్రీనివాస ప్రసాద్, ఈ.ఈ చంద్రశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్, ఎం.పి.డి.ఓ లు, విద్యుత్ శాఖ, హౌసింగ్ ఏ.ఈ లు, వర్క్ ఇన్స్పెక్టర్ లు, వార్డ్ అమినిటి సేక్రటరీ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాత జాబితా రద్దు చేశాం



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రెవిన్యూ అధికారులతో సంబంధం లేకుండా తయారు చేసిన పాత ఇళ్ల జాబితాను రద్దు చేసినట్లు వీఆర్వో బాలమురళి తెలిపారు. విశాలాంధ్రంలో సోమవారం 'పెళ్లి కాకుండానే వలంటీరుకు ఇంటి పట్టా' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై విచారణ జరపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు వీఆర్వో బాలమురళి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విశాలాంధ్రతో మాట్లాడారు. రెవిన్యూ అధికారులతో సంబంధం కొంతమంది వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ జాబితాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పేర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అందుకే ఆ పాత జాబితాను రద్దు చేసి కొత్త లబ్దిదారుల జాబితా తాము తయారు చేశామన్నారు. మొదట్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్దిదారుల జాబితా తయారు చేయడం వలన ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. తాము ఈ సమస్యను పరిష్కరించామన్నారు. అనర్హులైన వలంటీర్ల పేరుతో ఉన్న ఇంటి పట్టాలు రద్దు చేసి అర్హులకు ఇచ్చామని ఆయన తెలిపారు. నూతన జాబితాలో అర్హులకు మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చామని బాలమురళి చెప్పారు. వలంటీర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఉన్నతాధికారులు వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటారన్నారు.

క్రీడా నైపుణ్యంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి

- ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి
ప్రగతి సంస్థచే ఉన్నత పాఠశాలలకు ఆట వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. ప్రగతి సంస్థ, తిరుపతి వారి ద్వారా రేణిగుంట మండలం రేణిగుంట బాలురు, రేణిగుంట బాలికలు మరియు గుత్తివారిపల్లి ఉన్నత పాఠశాలలకు క్రీడా పరికరములు అందించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ క్రై సంస్థ, బెంగళూరు వారి సహాయంతో ప్రగతి సంస్థ వారు క్రీడా పరికరాలు పంపిణీ చేయడం జరుగుచున్నదని తెలిపారు. పిల్లల శారీరక ఎదుగుదలకే కాకుండా మానసిక వికాసానికి కూడా క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయని, అందరూ క్రీడా ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల లోని క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని వివిధ క్రీడలలో పాల్గొనేటట్లు చూడాలని కోరారు. క్రీడల ద్వారా వారిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, దీని ద్వారా భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, వారి ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సునీత, శైలజ, ప్రసాద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, రామ్మోహన్, తేజస్విని, పూర్ణిమ, ధనపాల్, ప్రగతి సిబ్బంది శిరీష, నీరజ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేపే తంబిరెడ్డి జనార్ధనరెడ్డి ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెటింగ్ సొసైటీ నూతన అధ్యక్షులుగా తంబిరెడ్డి జనార్ధనరెడ్డి గురువారం ఉదయం 11గంటలకు పదవిబాధ్యతలను స్వీకరించ నున్నారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తిని మంగళ వారం ఆయన నివాసంవద్ద కలిసి తన పదవిస్వీకార మహోత్సవానికి హాజరవ్వాల్సిందిగా జనార్ధనరెడ్డి కోరారు. సూళ్లూరుపేట నియోజకవర్గపరిధిలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిరథ మహారదులు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరవుత న్నట్టు తెలుస్తుంది. రాజకీయంగా ఆజాతశత్రువుగా పేరు ఉన్న జనార్ధనరెడ్డి సేవలను పార్టీ గుర్తించి ఆయనకు ఈ పదవి బాధ్యతలు అప్పగించడం పట్ల స్థానికులు తమ హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎస్వీయూలో రెక్టార్ పదవిని దళిత ఆచార్యులకు కేటాయించాలి

విశాలాంధ్ర -తిరుపతి ఎస్వీయూ: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల ఖాళీయైన రెక్టార్ పదవిని దళిత ఆచార్యులకు కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్వీ యూలో విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు నిర్వహించిన చర్చావేదికలో తీర్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దళితులకు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో దళిత ఆచార్యులకు సామాజిక న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో ఉన్న ఉన్నత పదవుల్లో ఒకటైనా దళితులకు కేటాయించాలని డిమాం డ్ చేశారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయం ఉపకులపతి, పాలకమండలి సభ్యులు దళిత ఆచార్యులకు సము చిత స్థానం కల్పించకపోతే విశ్వవిద్యాలయ పరిపాల భవనాన్ని ముట్టడిస్తామని, దళిత, యువజన, ప్రజా సంఘాల నేతృత్వంలో డప్పు కళాకారుల చేత దండోరా వేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి. మురళీకృష్ణ, రాఘవులు, రామచంద్రయ్య, చిరంజీవి, మాధవ, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర- గూడూరు : గూడూరు రోటరీ క్లబ్, శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్ యూసీసీ సభ్యులు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సంయుక్తంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా హెచ్ఐవీ రఘుగులకు పౌష్టికా హారాన్ని అందిచారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు కిరణ్ చక్రవర్తి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మరొక దాత మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడిన మీరందరూ తరుచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ,వైద్యులు సూచనలు తీసుకుంటూ , సమయానికి మందులు వాడుకుంటూ సరైన పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ చంద్రహాస్ డాక్టర్ సందీప్, సీనియర్ రొటేరియన్ దశరధ రామిరెడ్డి, రొటేరియన్ జిజి. నాయుడు, రోటరీ మేనేజర్ బలరాంరెడ్డి, సురేఖ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత - ఇద్దరు వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర- బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను మంగళవారం ఎస్సై మంజునాథరెడ్డి ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎందుకు సంబంధించిన వివరాలు మండలంలోని చిన్నయగుంట, తహానగర్ గ్రామాలలో బెల్ట్ షాపుల పేరుతో మద్యం అధిక రేట్లకు విక్రయిస్తున్నారు ఆ గ్రామాల పరిసర ప్రాంతాల వ్యక్తుల సమాచారం మేరకు, పూర్తి సమాచారంతో నిఘా ఏర్పాటు చేసి అధిక ధరలకు అక్రమంగా మద్యాన్ని నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద 13 మద్యం బాటిళ్లు ఉన్నాయి, మద్యం సిజ్ వ్యక్తులను రిమాండ్ కి తరలించామన్నారు. హెడ్ కానిస్టేబుల్ మధు, ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవాణి దర్శనం టికెట్ల కోటా కుదింపు

- ఆన్‌లైన్‌లో 750, ఆఫ్‌లైన్ లో 250
- మాధవం విశ్రాంతి గృహంలో శ్రీవాణి దర్శన టికెట్ల జారీ రద్దు
- రేపు శ్రీవారి ఆలయంలో తిరుప్పావడ పునఃప్రారంభం

విశాలాంధ్ర -తిరుమల : శ్రీవారి దర్శనం విషయంలో సామాన్య భక్తులకు మరింత ప్రాధాన్యత పెంచేందుకు వీలుగా శ్రీవాణి దర్శన టికెట్లను టిటిడి రోజుకు 1,000కి పరిమితం చేసింది. ఇందులో ఆన్‌లైన్‌లో 750, ఆఫ్ లైన్ లో 250 టికెట్లను జారీ చేస్తారు. ఇప్పటికే టిటిడి 500 టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయగా, అదనంగా జనవరి 11న మరో 250 టికెట్లు విడుదల చేయనుంది.మాధవం విశ్రాంతి గృహంలో శ్రీవాణి టికెట్ల కేటాయింపును టిటిడి రద్దు చేసింది. ఇక నుంచి శ్రీవాణి దాతలకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌ను అందుబాటులో ఉంచారు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేస్తారు. శ్రీవాణి దాతలు బ్రేక్ దర్శనం టికెట్‌కి బోర్డింగ్ పాస్‌ను జతచేయాలి. టికెట్ పై ఎయిర్‌లైన్ రిఫరెన్స్‌తో కూడిన పిఎన్ అర్ నంబర్‌ను కూడా నమోదు చేయించాలి.వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని సిబ్బంది బ్రేక్ దర్శన టిక్కెట్‌తో పాటు బోర్డింగ్ పాసును తనిఖీ చేసి దర్శనానికి అనుమతిస్తారు.

తిరుప్పావడ సేవ పునఃప్రారంభం :తిరుమల శ్రీవారి ఆలయంలో తిరుప్పావడ ఆర్జిత సేవ జనవరి 12 నుంచి పునఃప్రారంభం కానుంది. ఇందుకోసం యాత్రికులు తిరుమలలోని సిఆర్ఓ కౌంటర్‌లో నమోదు చేసుకోవాలి. వీరికి జనవరి 11న సాయంత్రం 5 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా 25 టికెట్లు జారీ చేస్తారు.

బియ్యపు మధుసూధన్ రెడ్డితో పేర్నాటి సమావేశం

విశాలాంధ్ర - గూడూరు : ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డిని మంగళవారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల గురించి చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత పది రోజులుగా మొదటివిడత ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని, సంక్రాంతిలోపే ప్రచారం ముగించి, రెండో విడత ప్రచారాన్ని నెలాఖరులోగా ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

రాంగోపాల్ వర్మ దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర - తిరుపతి : కాపులకు క్షమాపణ చెప్పాలి శ్రీశ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా వెంకటగిరి అధ్యక్షుడైన తోట కృష్ణయ్య అధ్యక్షతన ఈరోజు వెంకటగిరి పట్టణంలోని త్రిభువ ని సెంటర్లో రాంగోపాల్ వర్మ బొమ్మని దహనం చేయడ మైనది .ముఖంగా తెలియజేయడం ఏమనగా రాంగోపాల్ వర్మ అనే కుక్క సినీ పరిశ్రమలో చీడపురుగు అ న్నారు.ఎవరు డబ్బులు ఇస్తే అవతల వాళ్ళని అసభ్యంగా విమర్శించి వారి మీద అసభ్యమైన సినిమాలు తీసే ఇటువంటి కుక్కను అందరూ బహిష్కరించాలని కాపు సంఘం తరఫున కోరుకుంటున్నాం.. కాపులు పట్ల ఇతను మాట్లాడిన మాటలు దారుణమన్నారు.రాంగోపాల్ వర్మ ఇదే పంథాన్ని అనుసరిస్తే రాష్ట్రంలో ఇతని సినిమాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.తక్షణమే ఇతనిపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ను కలిసిన జడ్పీటిసి, ఎంపీపీ

విశాలాంధ్ర -ఓజిలి: ఓజిలి మండల ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, జడ్పీటీసీ గుంటమడుగు రవీంద్ర రాజు మరియు పలువురు వైసీపీ నాయకులు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలి శారు . సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య సూచనలు మేరకు మండలంలో ఎఫ్.డి.ఆర్ పనులకు సంబంధించి అదనపు నిధులను మంజూరు చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రఘురామరాజు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపనుల నాణ్యతవిషయంలో రాజీలేదు: కిలివేటి సంజీవయ్య.

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: శాసనసభ్యులు,తిరుమల తిరుపతి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ సిలివేటి సంజీవయ్య నాయుడుపేటపట్టణం,17వ వార్డు పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణాన్ని చైత్ పర్సన్ కటకం దీపిక,కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీ పడేయొద్దని అధికారులు సూచించారు. గతకొద్ది కాలంగా ఈప్రాంత ప్రజలు మురుగునీరు వెలుపలకు వెళ్లక పలుఇబ్బందులకు గురవుతున్నారు. ఈవిషయాన్ని గమనించిన మున్సిపల్ అధికారులు 15వ ఆర్థిక సంఘం నిధులతో 14,53,356 రూపాయల అంచినా వ్యయంతో ఈకాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బొబ్బిలిరాజు ఇంటి దగ్గర నుంచి అగ్రహారంపేట ప్రధాన మురుగు కాలువ వరకు 200 మీటర్ల పొడవుతో ఈ కాలువ నిర్మాణాన్ని చేపట్టినట్టు అధికారులు శాసనసభ్యులకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి,వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సచివాలయ ఏమ్యూనిటీ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, కౌన్సిలర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ మాసంలోపు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

లేనిపక్షంలో యువత ఉద్యమాన్ని రుచి చూపిస్తాం :తెలుగు యువత హెచ్చరిక...

విశాలాంధ్ర -తిరుపతి: సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ను విడుదల చేస్తామని , మాటే ఇచ్చి. వైకాపా పాలనలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వకపోవడం పై తెలుగు యువత స్టేట్ జనరల్ సెక్రెటరీ రవి నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న..సీఎం జగన్ రెడ్డి పాలన యువతకు ఉరితాళ్లు గా మారిందని దుయ్యబట్టారు.. వైసిపి గెలుపు కోసం విద్యార్థులు , నిరుద్యోగులు కాళ్లకు బలపాలు కట్టుకుని పనిచేశారని. నేడు ముఖ్యమంత్రి అయ్యాక జగన్ తడి గుడ్డతో గొంతులు కోస్తున్నాడని ఎద్దేవా చేశారు... తమకు పనికిమాలిన జీవో నెంబర్ వన్ అవసరంలేదన్నారు.. తాడేపల్లిగూడెం కే పరిమితమైన సీఎం జగన్ ను నిరుద్యోగులు విడిచిపెట్టరని , ముఖ్యమంత్రిని చుట్టుముట్టి ప్రశ్నించడాని కైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ జగన్ రెడ్డితో చేతులు కలిపి కులాల చిచ్చు పెట్టడం తగదని హెచ్చరించారు.. జనసేనాని పవన్ కళ్యాణ్ , టిడిపి నేత తమ చంద్రబాబులు లు ప్రజా సమస్యలపై పాలకులను ప్రశ్నిస్తే తప్పా అన్నారు.నేడు కష్టాల్లో అలమటిస్తున్న నిరుద్యోగుల ఉద్యోగాల కోసం తాము ఉద్యమం చేస్తున్నామన్నారు.అరెస్టులకు , నిర్బంధాలకు , దౌర్జన్యాలకు , దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.యువత ఆగ్రహిస్తే పర్యావసనం ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు.. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు యువత విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

11న జగనన్న తోడు
6వ విడత వడ్డీ రీఇంబర్స్మెంట్ లబ్దిదారుల ఖాతాలకు జమ : కలెక్టర్

విశాలాంధ్ర -తిరుపతి: 11 న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి చిరు వ్యాపారులకు, సాంప్రదాయ చేతి వృత్తులవారికి జగనన్న తోడు పథకం ద్వారా పెట్టుబడి అవసరాల కోసం రుణం తీసుకుని బ్యాంకులకు సకాలంలో చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ జమ కార్యక్రమంలో భాగంగా జగనన్న తోడు 6 వ విడత 'వడ్డీ రీఇంబర్స్మెంట్ ' లబ్ది దారుల ఖాతాలకు జమ చేయనున్నారని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 న రాష్ట్ర ముఖ్యమంత్రి తాడే పల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న తోడు వడ్డీని కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుండి ఉదయం 11 గంటలకు వీక్షించే విధంగా ఏర్పాటు చేసామని, డి.ఆర్.డి.ఏ ద్వారా గ్రామీణ మరియు మెప్మా ద్వారా పట్టణ ప్రాంతాల చిరు వ్యాపారులు తీసుకున్న రుణాలు రూ. 34.24 కోట్లకు గాను జిల్లాలో 34,243 మంది చిరు వ్యాపారులకు రూ. 78,66,685/- వడ్డీ రీఇంబర్స్మెంట్ లబ్ది కలగనున్నదని తెలిపారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీలో ఉండే యోగి మల్లవరం దగ్గర ఎగువమలవరం చెరువును ఆక్రమించుకొని ఇల్లు నిర్మిస్తున్న, భూకబ్జాదారులపై వారి పైన చర్యలు తీసుకోవా లని,కేసు నమోదు చేయాలని, ఆక్రమించిన ఇల్లులను తొలగించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తిరుపతి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తహశీల్దార్ లోకేశ్వరికి కి వినతి పత్రం సమర్పిం చారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుచానూరు సి.పి.ఎం పంచాయతీ కార్యదర్శి కే సుమన్ మాట్లాడుతూ తిరుచానూరు పంచాయతీలో యోగిమల్లవరం దగ్గర ఉన్న ప్రభుత్వ భూమి, చెరువులు సర్వేనెంబర్ 1/1,1/2 లో ఉన్న ప్రభుత్వ చెరువు భూమిని 12 ఎకరాల 40 సెంట్లు కబ్జాకు గురవు తున్నదని,దీనిని పరిరక్షించాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకోవడం లేదని,ఇప్పటికీ దానిపైన కోర్టులో కేసు ఉన్నప్పటికీ ఏమాత్రం లెక్క చేయకుండా ఇల్లులు నిర్మిస్తూ అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ విషయాన్ని అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకోవడం లేదని,కోట్ల విలువ చేసే చెరువులైన కబ్జా కాకుండా కాపాడాలంటే ఆ సర్వే నెంబర్లు విచారణ చేసి కంచె వేయాలని, ఆ చెరువ భూమిలో బోర్డులు పెట్టాలని, ఆక్రమించి ఇల్లు కట్టుకున్న వాటిని తొలగించాలని ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి ని చేపడతామని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సంక్రాతి సంబరాల్లో కోడి పందేలు, జూదం నిషేధం

విశాలాంధ్ర-తొట్టంబేడు: సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు, జూదం నిషేధించినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ దృష్ట్యా తొట్టంబేడు మండలంలో కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామని రాఘవేంద్ర పేర్కొన్నారు. మండల ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా సాంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో చేసుకోవా లని ఆయన కోరుకున్నారు. కోడిపందేలు, జూదం ఆడుతూ గొడవలు, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రాఘవేంద్ర హెచ్చరించారు. కోడిపందేలు జరిగే ప్రాంతాలను ఎవరైనా తమకు తెలియజేస్తే వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు . పండుగల్లో ఎవరైనా ఇతర ప్రాంతాలకు, ఊర్లకు వెళ్తే పోలీసులకు సమాచారం తెలియజేయాలని సంబంధిత ప్రాంతాల్లో పోలీసుల గస్తీ ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచరాదన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు , కోడిపందేలు నిర్వహించే ప్రాంతాలు తెలిస్తే వెంటనే 9440900724 నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నిరంకుశ పాలన అంతమయ్యే సమయం ఆసన్నం: మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలన అంతమయ్యే సమయం ఆసన్నమైందని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ కేంద్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం తలపెట్టిన చలో కావలి కార్యక్రమాన్ని జరగకుండా చూసేందుకు పోలీసులు గూడూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ను సోమవారం రాత్రి నుండి గృహ నిర్బంధం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలి ప్రాంతంలో వైసీపీ నాయకులు దళితులపై దాడి చేసి గాయపరిచారని ఈ సంఘటనను వ్యతిరేకిస్తూ మంగళవారం తెలుగుదేశం పార్టీ చలో కార్యక్రమంతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసేందుకు నిర్ణయించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులను నిర్బంధం చేయడం హేయమైన చర్య అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది దళితులు హత్యలు గావించబడ్డారన్నారు. అదేవిధంగా అనేకమంది దళితులపై దాడులు జరిగాయన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఆయన పాదయాత్రకు ఆనాటి తెలుగుదేశం పార్టీ ఎంతో సహకరించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, బాస్కర్ రెడ్డి, చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, ఇబ్రాయిల్ కుమార్, ఎండీ. అబ్దుల్ రహీం, ప్రణీత్ యాదవ్, సురేంద్ర, శివ ప్రసాద్ గౌడ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

బుప్రొఫుజెన్ తో తేనె మంచు పురుగు నివారణ

ఉద్యాన వన శాఖ అధికారి ఆర్. కార్తీక్

విశాలాంధ్ర - గూడూరు : బుప్రొఫుజెన్ తో తేనె మంచు పురుగు నివారణ సాధ్యపడుతుందని గూడూరు ఉద్యాన వన శాఖ అధికారి ఆర్. కార్తీక్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కొమ్మనేటూరు గ్రామం మామిడి తోపులో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. మామిడి పంటలో సస్యరక్షణలో భాగంగా పూత, పిందె రావడానికి 13-0-45 ఎన్.పి కె 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు మరియు బోరాన్ 1 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే పూత దశలో తేనేమంచు పురుగు నివారణకు బుప్రొఫుజెన్ 2 మిల్లీ కానీ, తయోంథాక్సా 0.6 గ్రాములు కానీ పిచికారీ చేయాలని సూచించారు. అలాగే తెగుళ్ల నివారణకు కార్బెండైజం, మాన్కోజెబ్ 2 మిల్లీ కానీ, హెక్సాకొనజోల్ 1.5 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మామిడి పండ్లు మంచి రంగు, సరైన దశలో పక్వానికి రావడానికి ఫ్రూట్ కవర్స్ వాడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ ఏఏ కె. ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఇన్ స్టోకు 78 విద్యార్థుల ఎంపిక

- శ్రీచైతన్య ప్రిన్సిపల్ కోట శ్రీనివాసులు

విశాలాంధ్ర - గూడూరు : దేశ వ్యాప్తంగా నిర్వహించచే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఇన్ స్టో) మొదటి లెవల్ పోటీ పరీక్షలో గూడూరు పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం పాఠశాల నుండి ప్రైమరీ విద్యార్థులు అధిక సంఖ్యలో 78 మంది ఉత్తీర్ణత సాధించి రెండవ లెవల్ పరీక్షకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపల్ కోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ఏజీఎం ఎన్. శ్రీకాంత్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాల గూడూరు బ్రాంచ్ నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా వీరి నుండి స్ఫూర్తిని పొంది వారిలో ఉన్నటువంటి మేధస్సును వెలికి తీసి బాహ్య ప్రపంచానికి తెలియజేయాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతీ విద్యా సంవత్సరంలో లాగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులలో ఎంటీఎస్ఓకు 39 మంది, ఎన్ఎస్ఓ లో 12 మంది, జీటీఎస్ఓలో 15 మంది, ఈటీఎస్ఓలో 12 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ లు శ్రీహరి బాబు, హరి బ్రహ్మ యాదవ్,ప్రైమరీఇంఛార్జిఅప్సర్,ప్రీప్రైమరీఇంఛార్జికిరణ్మయి, ఇన్ స్టో ఇన్ ఛార్జ్ రాధా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి తెలుగుదేశం పార్టీనే శరణ్యం

-బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రాభివృద్ధికి తెలుగుదేశం పార్టీనే శరణ్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం 34వ వార్డు పరిధిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేయడంతో సామాన్యుల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యుత్, బస్సు ఛార్జీలు, ఇంటి పన్నులతో పాటు వివిధ రకాల పన్నులు భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారం పెట్టారన్నారు. ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. శ్రీకాళహస్తిలో అయితే ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు గురించి ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల వాక్ స్వాతంత్ర్యం హరించడానికి జగన్ సర్కారు జీవో నంబరు:1 అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ జీవోకు వ్యతిరేకంగా జరిగే పోరుకు తమ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ జీవోకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటంరెడ్డి రామలింగారెడ్డి ఇంట ఎమ్మెల్యే సంజీవయ్య

విశాలాంధ్ర - నాయుడుపేట : సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాయుడు పేట పట్టణం బాలాజీ గ్రీన్ సిటీ ప్రాంతంలో పర్యటించారు.బాలాజీ గ్రీన్ నందు కాపురం ఉంటున్న చిల్లకూరు ప్రాథమిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు కాట్టం రెడ్డి రామలింగారెడ్డి నివాసంలో ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయ నతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి ప్రియశిష్యుడుగా, గతప్రభుత్వాలలో పెళ్లకూరు మండలంనందు చక్రంతిప్పిన కాటంరెడ్డి రామలింగారెడ్డి గత కొద్దికాలంగా రాజకీయంగా స్తబ్దుగా ఉన్నారు. గతసా ర్వత్రిక ఎన్నికల ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి,పెళ్లకూరు మండలపరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీవిజయం సాధించేందుకు కృషిచేశారు. పార్టీ అభ్యున్నతి కొరకు తమవంటి సీనియర్ల సలహాలు అవసరమని ఆయనతో సంజీవయ్య అన్నారు. తమనాయకుడు రామలింగారెడ్డితో, సంజీవయ్య ప్రత్యేకంగా సమావేశం అవడంపట్ల రామలింగారెడ్డి అభిమానులు తమహర్షం వ్యక్తంచేస్తున్నారు. పెద్దాయన రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చక్రం తిప్పి పెళ్లకూరు మండలంలో మరలా వైయస్సార్ పార్టీ ఘనవిజ యానికి కృషిచేయాలని వారు కోరుతున్నారు. ఈకార్యక్రమంలో సంజీవయ్య వెంట పార్టీసీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి,నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి,పార్టీ మండలఅధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్టీనాయకులు కటకం జయరామయ్య, బైన మల్లికార్జునరెడ్డి,, స్థానిక కౌన్సిలర్లు, పార్టీనాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఈసియల్ కంపెనీకి వచ్చే పైపులైన్ లీకేజీ..



విశాలాంధ్ర - ఏర్పేడు : మండలంలోనిఇసుకతాగేలి అయ్యప్ప స్వామి గుడిలోకి చేరిన మురుకునీరు.. పట్టించుకోని ఈసీఎల్ కంపెనీ ప్రతినిధులు.తిరుపతి నుంచి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ఉన్న ఈసీఐఎల్ కంపెనీకి వచ్చే మురికినీటి పైపులైను ఏర్పేడు మండలం ఇసుక తాగేలి గ్రామం వద్ద లీకేజీకి గురైంది.. ఈసీఎల్ కంపెనీలో వివిధ అవసరాల నిమిత్తం యాజమాన్యం తిరుపతి నుంచి నీరు తీసుకురావడానికి ఒక పైపులైను ఏర్పాటు చేసిఉన్నారు. ఆ పైపులైను గత రెండు రోజుల క్రితం మరమ్మతులకు గురై ఉంది .. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఇసుక తాగేలి గ్రామం వద్ద ఉన్న అయ్యప్ప స్వామి గుడిలోకి మురుకీ నీరు చేరింది.. దీంతో అయ్యప్ప స్వామి గుడికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుడిలోకి వెళ్లాలంటే మురుకీ నీరు తొక్కి లోపలికి వెళ్లాల్సి ఉంది. కావున మరమ్మత్తులకు గురైన మురికి నీటి పైపులైను వెంటనే మరమ్మత్తులు చేపట్టి పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

యువశక్తి పోస్టర్ విడుదల



విశాలాంధ్ర - తిరుపతి : వెంకటగిరి జనసేన పార్టీ ఆఫీసులో ఈరోజుయువశక్తి పోస్టర్ ప్రదర్శన జరిగింది భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా12 వ తేదీ న రణస్థలంలో జరగబోయే "యువశక్తి" కార్యక్ర మంలో దేశ విదేశాల నుంచి యువకుల్ని ఆహ్వానించి దేశ భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని యువతి యువకుల దగ్గర నుంచి వారి యొక్క అద్భు తమైన ప్రసంగాన్ని రణస్థలం వేదిక మీద వారి యొక్క అభిప్రాయాన్ని తెలియజేసే విధంగా శ్రీ జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీ పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టువంటి యువశక్తి కార్యక్రమాన్ని జనసేన నాయకులు జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు జన సైనికులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని వెంకటగిరి జనసేన పార్టీ కోరుకుంటుందిలి ఈ కార్యక్రమంలో ఉమ్మడినెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి చమ్మండి రాధమ్మ పట్టణ అధ్యక్షుడు రామారావు అనిల్ కుమార్, పట్టణఉపాధ్యక్షురాలు వేమన బోయిన కవితా రాణి ,పట్టణ ప్రధాన కార్యదర్శులు జల్సా రాజా, సురాయపాలెం శేఖర్, పృధ్వీరాజ్, వెంకటగిరి రూరల్ మండలం నాయకుడు సర్వేపల్లి కోటేశ్వరరావు,బాలు, జనసేన నాయకులు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటగిరి కమిషనర్ పై వేటు

విశాలాంధ్ర - తిరుపతి : వెంకటగిరి కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీ నేదురుమల్లి రామ కుమార్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దృష్టి సారించారు.వెంకటగిరి లో నేదురుమల్లి మార్క్ మార్పులు మొదలయ్యాయి అందులో భాగంగా వెంకటగిరి కమీషనర్ పై బదిలీ వేటు పడింది. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ పై బదిలీ వేటు ఆయన సెలవు పై పంపినట్టు సమాచారం. ఆయన స్థానంలో వెంకట రమణయ్య ను నియమించిన ప్రభుత్వం. ఈరోజే బాధ్యతలు తీసుకునే అవకాశం. వెంకటగిరిలో రేపు జరుగనున్న అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం పై అధిష్టానం సీరియస్ గా ఉన్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే బదిలీలు జరిగాయని పార్టీ వర్గాలు తెలియజేశాయి. మరికొన్ని రోజుల్లోనే మరి కొంతమంది కీలక అధికారుల బదిలీలు జరుగునున్నట్టు సమాచారం.

దివ్యాంగుడికి వీల్ చైర్ పంపిణీ

విశాలాంధ్ర - తిరుపతి : ఈరోజు ప్రపంచ 100 వ ఇన్నర్ వీల్ డే సందర్భంగా,,, ఇన్నర్ వీల్ క్లబ్, వెంకటగిరి శాఖ వారి ఆధ్వర్యంలో, ఘనంగా వార్షికోత్సవం ప్రసాద్ నివాసంలో నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో, నడవలేని ఒక దివ్యంగ ఎడికి సహృదయంతో,, వీల్ చైర్ అందించినారు. కార్యక్రమంలో పాల్గొని, విన్నర్ విల్ సందర్భంగా కేక్ కట్ చేసి, అందరికీ పంచినారు. ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి ,సెక్రెటరీబి.మాధవి ట్రెజరర్మల్లమ్మ కమిటీ మెంబర్, ప్రశాంతి రాజ్ యూసఫ్,సెక్రటరీ.దివ్యాంగులుసంక్షేమసేవాసంఘం. వెంకటగిరి. పాల్గొన్నారు.

గర్భవతులకు పాలు గుడ్లు పంపిణీ



విశాలాంధ్ర - తిరుపతి : మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులైన శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్అర్ సంపూర్ణ పోషణ పథకం బాలింతలకు ,గర్భవతులకు , పిల్లలకు ఆరోగ్యము -పోషణ మరియు పిల్లల కు బడి/చదువు అలవాటు కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని ఆ మంచి కార్యక్రమాలు కొనసాగిస్తూ ఈ రోజు 12వ సచివాలయం పరిధి లోని 23వ వార్డులోని గాజుల వీధి అంగన్వాడీ స్కూల్ నందు వెంకటగిరి వై యస్ అర్ కాంగ్రెస్ పార్టీ 23వ వార్డ్ కౌన్సిలర్ ఆటంబాకం శ్రీనివాసులు రెడ్డి పాల్గొని ఆరోగ్య బలవర్ధ ఆహారం గర్భవతులకు మరియు బాలింతలకు పాలు గుడ్లు మరియు ఇతర సామాన్లు ఈ రోజు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్,అంగన్వాడీ సిబ్బంది మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు మండలం రాజగోపాలపురం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు ఇంద్రానమ్మ(75) మృతి చెందింది. ఈ ప్రమాదం మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో సంభవించింది.వివరాలు ఇలా రాజగోపాల పురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్య శెట్టి సతీమణి ఇంద్రానమ్మ కాలకృత్యాలు కోసం తెల్లవారుజామున పొలాల వద్దకు వెళ్ళింది.ఈ నేపథ్యంలో రాజగోపాలపురం నారాయణస్వామి కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు ఇందిరా నమ్మ అక్కడక్కడ మృతి చెందారు.అయితే వాహన ప్రమాదంలో ఇంద్రాణమ్మ చనిపోయినట్టు సమీప కాలనీవాసులు గుర్తించి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు, పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు.ఈ క్రమంలో ఎస్సై పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలోనే పోలీస్ సిబ్బంది సంఘటన స్థలం చేరుకుని ప్రమాదానికి కారణాలను ఆరా తీశారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ తరలించడంతో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఇంద్రానమ్మ సవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.అయితే రేయ్ పగలు లేకుండా ఏకధాటిగ చమర్తి కండ్రిగ కంకర క్వారీ నుంచి వెళ్తున్న టిప్పర్లే కారణం అని గ్రామస్తులు ఆరోపించారు.దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు స్థానిక ఎస్సై పురుషోత్తం రెడ్డి చెప్పారు.

హమాలి కార్మికులకు పెంచిన కూలీరేట్లతో

13 నెలల అరియర్స్ తక్షణమే ఇవ్వాలి

లేకుంటే ఈనెల 18 నుండి గోడౌన్లు బంద్ నిర్వహిస్తాం : ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మురళి

విశాలాంధ్ర- తిరుపతి: గురువారం 11 గంటలకు తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద సివిల్ సప్లయిస్ హమాలి యూనియన్ ఆధ్వ ర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు అనంతరం డిఎంకు మెమోరాండం సమర్పించారు ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటీ యూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మురళి మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హమాలీ కార్మికులకు పాత అగ్రిమెంట్ అయిపోయి 13 నెలలు గడుస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు కూలి రేట్ల కోసం ఇప్పటికే కార్పొరేషన్ ఎండి దగ్గరికి కమిషనర్ కారు సివిల్ సప్లై కార్పొరేషన్ మినిస్టర్ దగ్గరికి ఎన్నిసార్లు యూనియన్ లీడర్లు తిరిగిన సమస్య పరి ష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రస్తుతం ఇస్తూ ఉన్నటువంటి క్వింటాలకు మూడు రూపాయలు పెంచి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు జీవోను విడుదల చేసి 13 నెలల అరియర్స్ ని ఇవ్వడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచినటువంటి ధరలతో పాటు పెండింగ్లో ఉన్నటువంటి పిఎఫ్ రసీదుల్ని చెల్లించాలని అలాగే కొత్తగా జాయిన్ కావాల్సినటువంటి హమాలీలకు పిఎఫ్ కట్టి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు హమాలీ కార్మిక సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వ అధికారులు దున్నపోతుపై వర్షం కూర్చున్నట్టుగా వ్యవహరిస్తున్నారే తప్ప కష్టపడి పనిచేసేటువంటి అమాలీ కార్మిక సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు సివిల్ సప్లై కార్మిక సమస్యలు పరిష్కారం కాలేదు కాబట్టే ఈరోజు 13 జిల్లాల్లో నిరసన కార్యక్రమం కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహిస్తూ ఉన్నామని ఈనెల 18 వ తారీఖున లోపల అమాలి సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లు బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్ డి రవి సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షులు అయ్యప్ప హమాలీ కార్మికులు చెంచయ్య ముత్తు పలని కుమార్ సుబ్రహ్మణ్యం ప్రకాష్ మురళి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ప్రముఖ ఆలయాల్లో శ్రీకాళహస్తి పాలకోవా స్టాల్స్ ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొని వచ్చే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాలకోవాతో వచ్చే ఆదాయంతో పాడి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా కృషిచేస్తానన్నారు. రైతులకు పాల సొసైటీ తరపున పాడి ఆవులు తీసుకోవడానికి రుణాలు అందజేసే విధంగా కృషి చేస్తామన్నారు. పాడి రైతుల కోసమే అమూల్ పాల పరిశ్రమను రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. అమూల్ తో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ చైర్మన్ ఎం..మధుసూదన్ రావు,సభ్యులు హరినాథ్ రెడ్డి, మంగమ్మ, రామయ్య, రామ్మూర్తి, మునికృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రమణి అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, మోహన్ నాయుడు, కందాటి ఈశ్వర్ రెడ్డి, భక్తవత్సలం నాయుడు, వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, చింతామణి పాండు, మునిరామయ్య, శంకర్ రెడ్డి, పఠాన్ ఫరీద్, గంగి రెడ్డి, పసల కృష్ణయ్య, ఈగల హరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో జరిగే 'యువశక్తి'ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోఈ నెల 12వ తేదీన జరుగనున్న యువశక్తి కార్యక్రమం జయప్రదం చేయాలని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ఛార్జి వినుత కోట పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె మంగళవారం రేణిగుంటలో యువశక్తి కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినుత కోట మాట్లాడుతూ... రణస్థలంలో జరుగుతున్న యువశక్తి కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలి రావాలని ఆమె కోరారు. యువత తమ సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి భవిష్యత్తు కోసం తొలి అడుగు వెయ్యాలని కోరారు. అనంతరం యువశక్తి పోస్టర్ ను ఆటోలకు అతికించి... ప్రయాణిస్తున్న యువతకి అందించి కార్యక్రమం గురించి ప్రచారం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, నియోజకవర్గ కార్యదర్శి పాలూరు ముని కుమార్, భాగ్య లక్ష్మి, త్యాగరాజులు, జ్యోతికుమార్, గంగా, గిరీష్, ముఖేష్, సుధాకర్, అబ్బులురెడ్డి , గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పట్టణంలోని తెలుగు గంగా కాలనీ నందు గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని ముందస్తు సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలు ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని అలరించారు. కళాశాల ఎదుట ఏర్పరచినటువంటి భోగిమంటల చుట్టూ విద్యార్థినులు గొబ్బి పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచారు. చివరగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాలుపంచుకొని వేడుకగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

"భాష్యం హై స్కూల్"లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పట్టణంలోని శ్రీ రామ్ నగర్ కాలనీ నందు గల భాష్యం హై స్కూల్ లో జోనల్ ఇన్చార్జ్ యల్.లక్ష్మణ్ రావు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ వై. ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన డిఎస్పి విశ్వనాథ్, ట్రాఫిక్ సిఐ వెంకటప్ప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కుల మత జాతి వర్గ భేదాలు లేకుండా అందరూ బాగా చదివి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయక వస్త్రాలను ధరించి, ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా ర్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గులపోటీలు, వంటచేయకుండా పౌష్టికాహారం తాయారు చేయడం వంటి పోటీలు నిర్వహించారు. అనం తరం ముఖ్యఅతిధులుచేతబహుమతిప్రధానం చేసారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అందరూ పాల్గొని పండగ వాతావరణంతో అలరించారు.

విజేత విద్యార్థిని శ్రావణికి నాట్య మయూరి పురస్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : విజేత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొండా శ్రావణి నాట్య మయూరి పురస్కారం అందుకున్నది. కళా నిలయం వారు చిలకలూరిపేట లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన పోటీలలో విజేత పాఠశాల విద్యార్థిని శ్రావణి ప్రదర్శించిన నృత్య ప్రదర్శనకు గాను కళానిలయం వారు శ్రావణికి నాట్య మయూరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజేత స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డి శ్రావణి నృత్య కళా నైపుణ్యాన్ని ప్రశంసించి, నాట్య మయూరి పురస్కారం అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్ ఉమా సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదే మా కర్మ మన రాష్టానికి కార్యక్రమంలో నెలవల సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - పెళ్లకూరు: మండలంలోని పునబాక పంచాయతీ నందు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నేలవల సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఇదేమి కర్మ మహా రాష్ట్రానికి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ మరియు సులూరుపేట పరిష్కారాలు పర్వీన్ తాజ్ హాజరయ్యారు. ఎస్సీ ఎస్టీ మీద కేసులు పెట్టడం వారిపై దుర్వినియోగంగా ప్రవర్తించడం సరికాదని నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఓట్లతోనే జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యారని వారి మీద కేసులు నమోదు చేసి వారిని భయాందోళనకు గురి చేయడం సరి కాదన్నారు. ఒక సామాన్యుడు ఓటుతో మిమ్మలని తరిమికొడతాడని గుర్తు చేసుకోవాల్సిన విషయం మీరు తెలుసుకోవాలని నెలవల సుబ్రమణ్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దేవ రెడ్డి నాగేందర్ రెడ్డి, గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, శేఖర్ నాయుడు, ప్రసాద్ నాయుడు,హరి నాయుడు, బెన్నీ, అమావాస్య శివ, యుగంధర్, మురళి నాయుడు, కేవీ నాయుడు, పరుశరం, గురవయ్య, వేలూరు రమణయ్య, అత్తివారం గోపాల్ రెడ్డి, బాలరాజు, వెంపల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

చేతివృత్తుల దారుల సమాఖ్య నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- తిరుపతి: ఆంధ్ర ప్రదేశ్ చేతివృత్తుల దారుల సమాఖ్య 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ తిరుపతి జిల్లా సీపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి మురళి. ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు.డి. రామచంద్రయ్య. నారాయణ బాబు లు ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 56 బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి నిధులు కేటాయించకుండా ఖర్చు చేయకుండా కుల వృత్తులను నిర్వీరం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కులవృత్తులకు ఎంత మందికి లబ్ధి చేకూర్చారు శ్వేత పత్రం విడుదల చేయాలని. ఇప్పటికైనా అర్హులైన వారికి రెండు లక్షల రూపాయలు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని టిటిడి దేవస్థానంలో కుల వృత్తులకు ప్రాధా న్యత ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి.సామాజిక న్యాయం ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో విశ్వనాథ్. ఎండి రవి. ఉదయ్. జయమని. ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ బాబుకు డాక్టరేట్ ప్రధానం



విశాలాంధ్ర -తిరుపతి ఎస్వీయూ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి మద్దెల రమేష్ బాబుకు డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన వర్శిటిలోని ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ తమటం నురేంద్రా రెడ్డి పర్యవేక్షణలో " ఏ కల్చరల్ హిస్టరీ ఆఫ్ ది కృష్ణ డిస్ట్రిక్ట్ (బేస్డ్ ఆన్ ఇన్స్క్రిప్షన్స్) " అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినందుకు డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు సిఈ వెల్లడించారు. రమేష్ బాబు పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేశారు. రమేష్బాబుకు డాక్టరేట్అవార్డురావడంపట్లపలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ కార్యాలయమునకు కంప్యూటర్లు

విశాలాంధ్ర -ఓజిలి : ఓజిలి రెవెన్యూ కార్యాలయమునకు మంగళవారం బట్ల కనుపూరు గ్రామానికి చెందిన గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు మధుసూదన్ రెడ్డి సహాయంతో1.5 లక్షల విలువ చేసే రెండు కంప్యూటర్లు ఒక ల్యాప్ టాప్ లను తహసీల్దార్ లాజరస్ కు అందజేసినట్లు ఆ ట్రస్ట్ మేనేజర్ రవీంద్ర రెడ్డి తెలియజేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు కొండూరు దామోదర్ రాజు, బట్టి కాయల కృష్ణయ్య చంద్ర రాజు తదితరులు ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు : డీఎస్పీ

విశాలాంధ్ర - గూడూరు : క్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందాలు, ఉత్సవాలు నిర్వహించి, డిజే అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాల యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సందర్భంగా గూడూరు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగలకు సొంత గ్రామాలకు వెళ్ళేవారు ఇంట్లో విలువైన బంగారం వస్తువులు వుంచరాదన్నారు. రెండు, మూడు రోజులకు పైగా ఇతర ప్రాంతాలకు వెళితే తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయా లని ప్రజలకు సూచించారు. ఎవరైనా సంచరిస్తూ ఉంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. భోగి మంటలు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని వెల్లడించారు. ఈ సమావేశంలో సిఐలు హజరత్ బాబు, వెంకటేశ్వరరావు, దశరధ రామారావు హరికృష్ణ, డివిజన్ లోని ఎస్ఐలు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గూడూరు 2వ పట్టణంలోని గాంధీ నగర్ ఎస్టీ కాలనీలో 50 మంది నిరుపేద మహిళలకు చీరలు మన ప్రగతి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా ప్రగతి సభ్యుడు బాలకృష్ణం నాయుడు వ్యవహరించారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, వాకాటి రామ్మోహన్ రావు, ఎక్సైజ్ శాఖ దయాకర్, రాము, సతీష్, విమల్ రావు, వాలంటీర్ అన్నపూర్ణ, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సిఆర్ రెడ్డి ఆసరాలో ఉన్న రెడ్డి బంధువులకు చీరలు, పంచీలు, చొక్కాలు అరిసెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా బండి ధనుంజయ రెడ్డి సిద్ధారెడ్డి, కృష్ణా రెడ్డి, సనత్ రెడ్డి, హరినాథ్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మేడం, ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, హరినాథ్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులను వివరిస్తున్న డిఈవో

విశాలాంధ్ర - పెళ్లకూరు : మండలంలోని పునబాక పంచాయతీ నందు ఉపాధి హామీ పనుల గురించి గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఉపాధి హామీ పన్నులకు వెత్తనం వస్తుంది. ఒక నెలలో శుక్రవారం మీటింగ్ నిర్వహిస్తున్నారా లేదా అన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్ర ,లింగం నాయుడు,మండల సచివాలయం కన్వీనర్ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం సులూరుపేట అధ్యక్షుడు అట్లా కిషోర్ గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర - గూడూరు : ఈ నెల 18 నుండి 22వ తేది వరకు బెంగళూరులో జరుగు తున్న 17వ సిఐటియు జాతీయ మహాసభలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఆ యూనియన్ జెండాలు ఆవిష్కరించాలని ఆలిండియా సిఐటియు పిలుపు మేరకు మంగళవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్లో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు.పట్టణ సహాయ కార్యదర్శి పి.మణి, నాయకులు జోగి శివకుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, జిల్లా సిఐటియు ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి. రమణయ్య, సీనియర్ నాయకులు బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ 'యువగళం' విజయవంతం కావాలి

- అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత టీడీపీ తెలుగుమహిళల పూజలు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 27వ తేదీన కుప్పం నుంచి ప్రారంభించనున్న 'యువగళం' పాదయాత్ర జయప్రదం కావాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నేతలు మంగళవారం అలిపిరిలోని శ్రీవారి పాదాల చెంత కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మునికృష్ణ, లతమ్మ, తుపాకుల కన్నెమ్మ, లక్ష్మి ప్రసన్న, రుద్రాక్షల కౌసల్యమ్మ, మాధవి, పార్వతమ్మ, హేమ, తరుణ, నాయు డమ్మ, ప్రసన్న, గౌసి, కృష్ణవేణమ్మ, ఈ సందర్భంగా చక్రాల ఉష మాట్లాడుతూ... ఈ నెల 27న కుప్పంలో ప్రారం భమయ్యే ఈ యువగళం పాదయాత్ర 400రోజుల పాటు జరిగి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగుస్తుందన్నారు. పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్కు ఎలాంటి ఆటంకాలు కలుగుకూడదని ప్రార్థిస్తూ అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత పూజలు చేస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా చెప్పారు. నారా లోకేష్ యువగళం పేరుతో చేపడుతున్న ఈ పాద యాత్రను అడ్డుకోవడానికి సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని చక్రాల ఉష ఆరోపించారు. పాద యాత్ర జరగకుండా నారా లోకేష్పై దాడులు చేయించడానికి వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. అందులో భాగంగానే అధికార పార్టీ నేతలు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారని ఈ సందర్భంగా చక్రాల ఉష గుర్తు చేశారు. యువగళం పాదయాత్ర అడ్డుకోవడంలో భాగంగానే జగన్ సర్కారు బ్రిటీషు కాలం నాటి చీకటి జీవో నంబరు:1 అమల్లోకి తెచ్చిందన్నారు. యువగళంకు మద్దతు తెలపడానికి ఏపీలోని యువత మొత్తం ఎదురు చూస్తోందన్నారు. నిఘా వర్గాల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న జగన్ ఎలాగైనా ఆటంకాలు సృష్టించడానికి పథకం రూపొందిస్తున్నారని ఆమె చెప్పారు. ప్రజలు ఈ విషయం గుర్తించాలని చక్రాల ఉష కోరారు. జగన్ సర్కారు పెట్టే ఆటంకాలు తట్టుకుని పాదయాత్ర కొనసాగించే శక్తి నారా లోకేష్కు ప్రసాదించాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు ఆమె చెప్పారు. నారా లోకేష్ పాద యాత్ర సందర్భంగా పటిష్టమైన భద్రత కల్పించాలని ఈ సందర్భంగా చక్రాల ఉష ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లోకేష్ కు ఏమైనా జరిగితే జగన్ సర్కారు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యువగళం పాదయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.